క్లుప్తంగా

20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చుండూరు(వేమూరు): ఈ నెల 20న మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో అరుంధతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ జాలాది రూబేను అధ్యక్షత వహించడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పెదపులివర్రులో ఇంటి స్థలం సర్వే చేయాలని, పట్టాదారు పాస్ పుస్తకం రద్దు చేయాలని అద్దేపల్లి నుంచి, భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చికెన్ స్టాల్ తొలగించాలని, వెబ్ ల్యాండ్ అడంగల్ కొరకు వెల్లటూరు నుంచి అర్జీలు అందాయని వివరించారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చని కోరారు.

వేమూరు: ప్రజల సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం పరిష్కార వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో శేష గిరిరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చాయి.

రేపు వేమవరంలో పాండురంగ కల్యాణం



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని స్వయంభొట్లగా ప్రసిద్ధి గాంచిన వేమవరంలో ఈ నెల 17న ఏకాదశి పురస్కరించుకుని శ్రీ రుక్మాభాయి సహిత పాండురంగ స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్వామి వారి కల్యాణంలో పాల్గొనే వారు సింహాద్రి శాస్త్రిని సంప్రదించాలని కోరారు.

20 నుంచి గురుపౌర్ణమి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ సాయిబాబా మందిర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రథం సెంటర్‌లోని శ్రీ సాయిబాబా ఆలయంలో శ్రీ సాయినాథ-దత్తాత్రేయ స్వామి వార్ల గురుపౌర్ణమి వేడుకలు ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతాయని కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు సోమవారం తెలిపారు. 20న భట్టిప్రోలు, అద్దేపల్లి పురవీధులలో శ్రీ సాయినామ ప్రచార కార్యక్రమంలో భాగంగా భిక్షాటన, 21న స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం గురుపౌర్ణమి సందర్భంగా నారాయణ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన వారాహి నవరాత్రులు



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండలం కొత్తనందాయపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారి దేవాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ముగింపులో భాగంగా దుర్గా మల్లేశ్వరస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

బాబుగారూ.. భృతి ఎప్పుడు..!

- నిరుద్యోగ భృతి కోసం యువత ఎదురు చూపులు
- కఠిన నిబంధనలతో నెలకొన్న అయోమయం
- ఇంటికో నిరుద్యోగ భృతి ఇవ్వాలంటూ నిరుద్యోగుల డిమాండ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంటికి నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి ఇప్పుడు నిబంధనల కొర్రీ పెట్టడంతో నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నిరుద్యోగ యువత అందరికీ తప్పని సరిగా నెలకు రూ.3 వేలు అందిస్తామని చెప్పిన అధికార పార్టీ నాయకులు ఇప్పుడు మాట మార్చి కనీసం ఇంటర్ విద్యార్హత ఉండాలనే నిబంధన పెట్టడంతో నిరుద్యోగుల్లో కలవరం మొదలైంది. దీనికి తోడు ఆ కుటుంబంలో ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులు కాకూడదనే నిబంధన అశనిపాతంలా మారింది. అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని అందిస్తామన్న హామీని ప్రభుత్వం తుంగలోకి తొక్కుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు తన సహజ వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఇప్పటికే ప్రజలు చేస్తున్న విమర్శలు మిన్నంటుతున్నాయి.

బాపట్ల: బాపట్ల నియోజకవర్గంలో 69వేల ఇళ్లు ఉన్నాయి. వీటిలో కనీసం ఐదు శాతం ఇళ్లకు కూడా ప్రస్తుతం అమలు చేస్తున్న నిబంధనలతో భృతి వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. నిరుద్యోగ భృతి అందితే కనీసం పోటీ పరీక్షలకు దరఖాస్తులు చేసేందుకు తల్లిదండ్రులకు భారం కాకుండా తమ సొంత డబ్బులతో పరీక్షలకు సిద్ధం కావొచ్చని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న నిరుద్యోగులు తాజా నిబంధనలతో అసంతృప్తికి లోనయ్యారు.

వయో నిబంధన, కుటుంబ నేపథ్యం, విద్యార్హతలు తదితర అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని అన్ని అర్హతలు ఉన్న కొద్ది మందిని మాత్రమే ఒడపోసి భృతి ఇవ్వనుందని అందుకున్న సమాచారంతో నిరుద్యోగ యువత డీలాపడ్డారు.



కూటమి సూపర్-6 హామీల్లో మొట్టమొదటి ప్రాధాన్యతనిచ్చిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం



నిరుద్యోగ భృతి కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాం. ప్రతి ఒక్క నిరుద్యోగికి భృతి ఇస్తామని చెప్పారు. తీరా ఇప్పుడు ఇంటర్ చదివి ఉండాలనే నిబంధన పెట్టారు.ఇది అన్యాయం. ఈ నిబంధనలను సడలించి అందరికి భృతి ఇవ్వాలి.

–పి.గోపి, నిరుద్యోగి, బాపట్ల.

నిరుద్యోగులను మోసగించటం సరికాదు



నిరుద్యోగులను మోసం చేసేవిధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ నిర్ణయాలతో నిరుద్యోగ యువత నష్టపోయే ప్రమాదం ఉంది. నిరుద్యోగులందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి కూడా భృతి ఇవ్వాలి.

–షేక్.వీస్సూ, నిరుద్యోగి, కుమ్మరిపాలెం

చిన్నపాటి ఉపాధితో బతుకు దుర్భరం



కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తుందని ఆశగా ఉన్నాం. డిగ్రీ పూర్తిచేసి పోటీ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నాను. చిన్నపాటి ఉపాధి దొరికినప్పటికీ చాలీచాలని వేతనంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి అందిస్తే పోటీ పరీక్షలు రాసుకునేందుకు, అవసరమైన పుస్తకాలు కొనుకునేందుకు ఉపయోగపడతాయి.

–ఎం.జగదీష్, నిరుద్యోగి, రేపల్లె

ఇంట్లో వారిపై ఆధారపడటం తప్పతుంది



ఎంఏ బీఎడ్ పూర్తయ్యింది. ప్రస్తుతం ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నాను. మధ్య తరగతి కుటుంబానికి చెందిన నేను ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తూ దరఖాస్తులు చేసుకునేందుకు నిత్యం డబ్బుల కోసం ఇంట్లో వారిపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగులకు అండగా నిలవాలి. వెంటనే నిరుద్యోగ భృతి అమలు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి. నిరుద్యోగులు డబ్బులు కోసం ఇంట్లో వారిపై ఆధారపడాల్సిన పరిస్థితులు దూరమవుతాయి.

– వేము రాజేష్, ఎంఏ బీఎడ్, ఆరుంబాక, చెరుకుపల్లి మండలం.

ఉద్యోగం వచ్చే వరకు భృతి ఇవ్వాలి



ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాను. ఉద్యోగం లేక పొలం పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదవించుకుంటున్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుద్యోగ భృతి ఇస్తానని ఎన్నికల ముందు ప్రకటించారు. నిరుద్యోగ భృతి ఇస్తే కుటుంబానికి ఎంతో తోడ్పాటు ఇచ్చినట్లు ఉంటుంది. నిరుద్యోగులకు ఉపాధి దొరికేంతవరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– అలపరి రవికుమార్, జంపని.

నిరుద్యోగ భృతి హామీ నిలబెట్టుకోవాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన హామీని నిలబెట్టుకోవాలి. నిరుద్యోగ భృతి పథకాన్ని నీరుగార్చకుండా త్వరిత గతిన ప్రారంభించి నిరుద్యోగులకు చేయూతనివ్వాలి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగాల కోసం సిద్ధమయ్యేవారు ఇంట్లో వారికి భారమవ్వకుండా చేయూతనిచ్చే నిరుద్యోగ భృతి త్వరత గతిన అమలు చేయాలి. నిరుద్యోగ భృతిని అమలు చేయకుంటే విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేపట్టక తప్పదు.

– వై.నవీన్, ఎస్ఎఫ్ఐ రేపల్లె డివిజన్ అధ్యక్షుడు

దోమల నివారణతో వ్యాధులు దూరం

రేపల్లె రూరల్: దోమల నివారణతో వ్యాధులను దూరంగా ఉంచవచ్చని మలేరియా రేపల్లె సబ్ యూనిట్ అధికారి వైవి కృష్ణయ్య చెప్పారు. డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా పట్టణంలోని నిజాంపట్నం రోడ్డు యూపీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమలతో అనేక రకాలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ముఖ్యంగా ఈడెస్ రకానికి చెందిన దోమలతో డెంగీ జ్వరం వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధితో జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మపు దద్దుర్లు వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కలిగిన వారు విధిగా వైద్యుల సహాయంతో త్వరితగతిన చికిత్స పొంది వ్యాధి నుంచి ఉపశమనం పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని, వారంలో ఒకరోజు డ్రైడేని పాటించాలని సూచించారు. నీటి నిల్వలు, తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలని చెప్పారు. నిద్రించే సమయంలో విధిగా దోమల తెరను వినియోగించాలని సూచించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

డెంగీ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తొలుత లెప్రసీ యూనిట్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందికి కుష్టువ్యాధి పట్ల అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించాలని లెప్రసీ యూనిట్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్‌లు ఎం.యల్లయ్య, ఎస్.సారంగపాణి, డీపీఎంవో పి.వెంకటేశ్వరరావు, గల్లా ఛత్రధర్, ఆశాలు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

రేపల్లె రూరల్: సమస్యలను పరిష్కరించేందుకు ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల వేదికను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. పొలాలకు వెళ్లే డొంక మార్గం ఆక్రమణకు గురైందని, ఆక్రమణను తొలగించాలని నగరం మండలం మంత్రిపాలెం గ్రామం నుంచి ఒక అర్జీ అందిందన్నారు. దూళిపూడి గ్రామానికి చెందిన కోరగంటి ఆనంద వరకుమార్ అనే వ్యక్తి తనకు రైల్వేలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని పొదిలి అనిల్‌కుమార్ అనే వ్యక్తి రూ.2.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని, తన డబ్బులను ఇప్పించాలని కోరుతూ ఒక అర్జీ చేసుకున్నాడని చెప్పారు. సాగుభూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ రాంబొట్లవారిపాలెం నుంచి



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

డొక్కా ప్రేమకుమారి అర్జీ చేసుకుందన్నారు. అడవులదీవి గ్రామం నుంచి అర్హతలేని వృద్ధాప్య పెన్షన్లపై తనిఖీలు నిర్వహించాలని ఒక అర్జీ అందగా, అదే గ్రామం నుంచి రేషన్‌కార్డుకు దరఖాస్తు అందినట్లు చెప్పారు. సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

వెదసాగు రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఏడీఏ అక్తర్ హుస్సేన్

రేపల్లె రూరల్: ప్రస్తుత వర్షా కాలంలో వెదసాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ అన్నారు. రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలలో వెద పద్ధతిలో సాగు ప్రారంభించిన సాగు భూములను సోమవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఇప్పటికే మూడు రోజుల నుంచి వర్షం కురుస్తోందని, మరో రెండు రోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. సాగు భూమిలో ప్రస్తుత స్థితిలో నీరు ఎక్కువ చేరటంతో వరి పిలకలు దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. రైతులు నిరంతరం పైరును పరిశీలిస్తుండాలని, నీరు ఎక్కువగా ఉంటే పొలం గండ్లు కొట్టాలని సూచించారు. వ్యవసాయ అధికారులు



వెదసాగు భూమిని పరిశీలిస్తున్న ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్

నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో మెలకువలను సూచించాలని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ఎంసీఏ క్రీడాకారుల ప్రతిభ

రేపల్లె రూరల్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తాడేపల్లిలో ఈ నెల 13, 14 తేదీలలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో రేపల్లె పట్టణానికి చెందిన మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఎంసీఏ) క్రీడాకారులు ప్రతిభ కనపరిచారు. బాలికల విభాగం అండర్–17 సింగిల్స్, డబుల్స్‌లో గరికపాటి పూజ, బాలురు అండర్–13 డబుల్స్ విభాగంలో విన్నర్‌గా అశోక్, తేజలు, సింగిల్స్‌లో రన్నర్‌గా సూర్య అవినాష్, బాలురు అండర్–17 డబుల్స్ విభాగంలో విన్నర్‌గా వి.మనోజ్‌కుమార్‌లు నిలిచారు. విజయవాడలో నిర్వహించిన టోర్నమెంట్‌లో అండర్–13 సింగిల్స్ విభాగంలో ప్రణిత విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు ఎంసీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పలువురు అభినందనలు తెలియజేసి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీఏ సభ్యులు జీ.హనుమంతరావు, పరుచూరి శ్రీనివాసరావు, కే.రత్నాకరబాబు, బాపారావు, రమేష్, రాఘవయ్య, రాజగోపాల్, కోచ్ ఎ.ధరణ్ దీపసాయి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంసీఏ సభ్యులు

పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించరూ..!

కొల్లూరు : శిధిలావస్థకు చేరిన పంచాయతీ భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటమురళీని మండలంలోని తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్ కోరారు. సోమవారం బాపట్లలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పంచాయతీ భవనం పరిస్థితిని వివరిస్తూ ఉపాధిహామీ పథకం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో పాటు, భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని కలెక్టర్‌కు వివరించారు. చిన్నపాటి వర్షాలకే పంచాయతీ కార్యలయం లోపలకి వర్షపు నీరు చేరడంతో పంచాయతీ కార్యకలాపాల నిర్వహణకు ఆటంకం కలుగుతుందని, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



బాపట్లలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి కృష్ణమోహన్

మొక్కల పెంపకంతో కాలుష్య రహిత సమాజం

కొల్లూరు : కాలుష్య రహిత సమాజం ఏర్పడాలంటే మొక్కల పెంపకం ఒక్కటే ప్రత్యామ్నాయ మార్గమని కొల్లూరు ఎంఈఓ–2 టీవీఎస్.జ్యోతి అన్నారు. సోమవారం కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఏఎస్ఓ శ్రీనివాసరావుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొక్కల పెంపకం పట్ల ఆసక్తితో మెలుగుతూ, ప్రజలకు సైతం మొక్కల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్. ఉషాకుమారి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

రేపటి నుంచి సీపీఐ విస్తృత స్థాయి సమావేశం

లక్ష్మీపురం: సీపీఐ గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 17, 18వ తేదీల్లో ఉదయం 10 గంటలకు గుంటూరులోని మల్లయ్య లింగం భవన్‌లో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఈ సమావేశాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, సీపీఐ వైఖరిని వెల్లడిస్తారని చెప్పారు. సభ్యులందరూ సకాలంలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతరావు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఈ నెల 17 నుంచి నవంబర్ 12 వరకు చాతుర్మాస్య వ్రత దీక్షలు జరుగుతాయని సాధన మండలి నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి శృంగేరీ పీఠానికి చెందిన ఉభయ భాషా ప్రవీణ హరి అన్నయ్య శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం కర్పూర యజ్ఞం జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగు నెలలు జరిగే షడక్షరీ మంత్ర జపంలో పాల్గొనదలచిన వారు బూర్లె అరుణ కుమారి, కోట యశోదా దేవిలను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి జంగం పద్మారావు సోమవారం స్థానిక ఎంపీపీఎస్(ఎల్ఈ) పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు, పలకలు, ప్యాడ్లు, నోట్ పుస్తకాలు అందజేశారు. తరగతి గదికి ఒక ఫ్యాన్‌ని వితరణ చేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ తన పిల్లలు కూడా ఇదే స్కూల్‌లో విద్యను అభ్యసించి ఒకరు యుఎస్ఏలో ఉద్యోగం చేస్తుండగా, మరొకరు ఐఐటీలో ఎంటెక్, ఇంకొకరు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదువుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం.పి.కిషోర్, పాస్టర్ జె.ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐలవరంలో కేసన జన్మదిన వేడుకలు

ఐలవరం(భట్టిప్రోలు): బీసీ సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు జన్మదినం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరంలో సోమవారం బీసీ సంఘం నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, బీసీ సంఘం నాయకులు కూరపాటి రఘురామయ్య, జొన్నాదుల రమేష్, ఈడే కోటేశ్వరరావు, మునగాల వీరభద్రరరావు, గ్రామ నాయకులు అత్తలూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బీసీ సంఘం నాయకులు

హిందూధర్మం ప్రాముఖ్యతను గుర్తించాలి



సనాతన ధర్మాలపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం గ్రామంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా ఫౌండేషన్ సభ్యులు అక్కల సుబ్బారెడ్డి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. హిందూ ధర్మం పవిత్రతను గురించి తెలియజేశారు. సనాతన ధర్మంలో భాగంగా ప్రతి ఒక్కరూ దేవాలయాలకు వెళ్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో దండు మోహనరెడ్డి, వాలి నాంచారరెడ్డి తదితరులు ఉన్నారు.